చిన్న కథ

# మానస సరోవరం

## (చైతన్య స్రవంతిలో రచన)

శ్రీ పి. యస్. శాస్త్రి

"మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయా !" అవునవు నవును. మనస్సే అన్నింటికీ మూలం. మనస్సు లేకపోతే మనమూ లేం! అంటే మనస్సు జడమైనప్పుడు మనిషికి ఐహిక బంధాలు నశిస్తాయి! అంతే...అంతే...అంతేనా ! "నీ మనసు నా మనసు ఏకమై..." అయి, అయి, అవడం అసలు సంభవిస్తుందా ? అంటే ఇక్కడ మనస్సంటే ఆలోచన. లోచనాలకందనిది ఆలోచన... సులోచన ఎక్కడవుందెక్కడవుంది ?...అక్కడే అక్కడే ఇంద్రజిత్తు దగ్గర...అంటే ఇంద్రుణ్ణి జయించినవాడనేనా?...–జిత్తు నుండి పుట్టిన తెనుగుపదం చిత్తు...అంతే! బ్యూటీ! మనం తెనుగు పదాలవ్యుత్పత్తి అండ్ వికాసంకని పెట్టగలమన్నమాట...గలం,గలం..., గురు లఘువుల కలయిక గలం! నల, నగ, సల, భ, ర, త, ఇలో ఈ గలం లేదు...అన్నట్టు గురువు, లఘువులను కలిపి ఏకసమాసం చేయడం సోషలిజంలక్ష్యంకదూ?...అందుకే..."అందుకే ఇూహాయి" అందుకే ఆంధ్ర సాహిత్యంలోకూడా గురు, లఘువులు ఎగిరిపోయి వచన కవిత్వం రాజ్యం చేస్తోంది...సో...ప్రభుత్వంవారి ఆదేశిక (ఆదేశికా, నిర్దేశికా?) సూత్రాల ప్రకారమే ఆంధ్ర సాహిత్యమూ నడుస్తోంది...

భేష్! భేష్! యీ విషయాన్ని వచ్చే సాహితీ సదస్సులో చెప్పి బూజుపట్టిన, బుర్రలు పండిన, పండితులకు వచనకవితా వికాసాన్ని నిరూపిస్తా...ఆహా సుదినం! ఒహో సుదినం...ఛందో పండితులకు దుర్దినం...అవునవును! అంతే...లేకపోతే ఆ 'సూర్యం' కవి "నీకు పద్యాలు రాయడం రాదు కనుక వచనం రాసి దాన్ని కవిత్వం అంటున్నావు" అంటాడా?...చట్రాలలో బిగించకుండా ఆధునిక నైరూప్య చిత్రకళలాగే సాహిత్యమూ నైరూప్యంగా వర్ధిల్లడానికి "అనిబద్ధ" లేక 'స్వేచ్ఛా', లేక 'పద్యగంధి' కవిత్వాన్ని రాస్తాం!...అది తప్పయితే దానికి 'కుందుర్తి'ని తిట్టాలి లేదా 'బాలగంగాధర తిలక్'నీ, వేగుంట మోహన్ ప్రసాద్‌ని లేదా తిరగబడు, విరగబడు, అరస, విరస, సరస కవుల్ని తిట్టాలి కాని నన్ను సభామధ్యంలో ఎంత అహంకారం ఆ పద్య కవికి?...

"వస్తున్నానయ్యా బాబూ! వస్తున్నా! తలుపు తీసేవరకూ ఆగలేవూ ?...వూ ?...ఎందుకని ? మీ ఆవిడ "నేను వచ్చేవరకూ వచ్చినట్టు కదలకుండా కూర్చోండి" అంటే నోరు మూసుకు కూర్చుంటావేం?...ఉండు...ఉండు వస్తున్నా..."

"హహహ! నిజమండీ! మీరు తలుపుకొట్టటం వినిపించ లేదు... అబ్బే మీరు వస్తారనుకుంటే నా యింటి తలుపులు బార్లా తీసిపెట్టి కూర్చోనూ ?...ఎంతమాట! మీరు నన్ను కలుసుకోవడానికి రావడం మహదానందకరమైన విషయం..."("...వెధవ వెధవ పెంట వెధవ! ప్రొద్దున్నే అయిదురూపాయలు అప్పు కావాలిట. వాకూ కావాలి యిచ్చే వెధవుంటే! ... చక్కటి ఆలోచనలు ఆగిపోయేలా చేశాడు...")

"ఆయ్! హహహ! ఏమీ ఆలోచించటంలేదండీ! 'ఊరక రారు మహాత్ములు...' అన్న పద్యం గుర్తుకు వచ్చి... భలేగా చెప్పారు; 'అప్పంటే తప్పు'! నిజమే! నిజమే... నేను వైద్యుణ్ణి మీరు రోగీనూ...(రోగం! వెధవ పాతకలా వున్నాడు, అప్పులుచేసుకు తిని!) నిజమే... 'అప్పిచ్చువాడు వైద్యుడు' అన్నాడు కదా సుమతీశతక కారుడు..."

"అబ్బే కాఫీ, సిగరెట్టు అన్నీ మానేశానండి ఖర్చులు పెరిగిపోయి... అందుకే మీకేదీ ఆఫర్ చెయ్యలేకపోతున్నా ... వెళ్తామంటారా... శుభం... వెళ్లిరండి!"

"ఉల్ఫాగా అయిదు రూపాయలు కొట్టేశాడు... ఇచ్చేదీ లేదు చచ్చేదీ లేదు!..."

"హహహహ...ఈ నవ్వెక్కడిది ? మదీయ మానసాంతరాళము నుండియే ఈ నవ్వు వెలువడుచున్నది... చాలు చాలు ..."ఓ అజ్ఞాత శక్తీ! బయటకు వచ్చి నీ నిజస్వరూపమును చూపుము..."

"ఓరీ రామారావూ! నీ పిచ్చికవిత్వాలన్నింటినీ శ్రద్ధగా విన్నట్టు నటించినందుకు, శంకర్రావుకు డబ్బియ్యక తప్పుతుందా?... 'ధనమూల మిదం జగత్' అన్న సూక్తి మరచిపోయావా ?... నీ కవిత్వానికి, కడుపులో త్రిప్పినా, ఆ భావాన్ని పైకి కనబడకుండా వుండ

టానికి ఎంత తిప్పలు పడివుంటాడో గ్రహించలేవు నువ్వు! ... హహహ! బాగా అయింది. ఇంకెప్పుడూ ఎవరికీ బలవంతంగా కవిత్వం వినిపించకు! ...!"

"హోరి మనస్సులోని మనిషి! సూక్ష్మ శరీరంలోంచి నువ్వు చేసే సహాయం ఇదా!... కారణ శరీరానికి తోడునీడగా, అండగావుండి నన్ను మంచి మార్గంలో నడిపించి మోక్ష సామ్రాజ్యాధిపతిని చెయ్య వలసింది పోయి, నన్నే అవహేళన చేస్తావా? "కవయః నిరంకుశా" అన్న సూక్తి వినలేదా?...నేను నిరంకుశుణ్ణి! నా యిష్టం వచ్చి నట్టు చేస్తా! చార్వాక మతంలో కలిసి నీ అస్తిత్వాన్నే కాదంటా! ఈ శరీరం, దానిలోని కోరికలు, యివే నిత్యమైనవి, సత్యమైనవి. ఆత్మలు, పరమాత్మలు, మోక్షం, పాపం, పుణ్యం, నువ్వూ, నీ సూక్ష్మ శరీరం, అన్నీ వొట్టి హంబగ్!... పో! పోయి నిన్ను సృష్టించిన విధాత అంటూవుంటే వాడికి చెప్పుకో!..."

"దెబ్బకి నోరు మూసాడు!" నువ్వే లేవు! ఒకవేళ వున్నా "నీ అస్తిత్వాన్ని నేను గుర్తించను!" అంటే ఏంచేస్తాడు తోక ముడవటం తప్ప! ఏం? పీపిల్స్ రిప్లబిక్ ఆఫ్ చైనా అనేది లేనే లెదు...ఫార్మోజాయే చైనా అని అమెరికా యిరవై యేళ్ళపైన బుకాయించలేదూ?...అంతే అంతే...

"......రా శారదామణీ ..." "నీవు లేక వీణ నిదురపోవు చున్నదీ..."

..."అమ్మోయ్... నిజంగానే బెడ్‌రూమ్‌లోంచి ముందుగది లోకి వస్తోంది..."...

"ఏంలేదు శారదా... ఉత్తినే పిలిచా... అదా ఏదో పాట నోటి కొస్తే..." "తప్పే తప్పే!... నోటికి వచ్చిన పాట పాడటం తప్పే, కాని... చూశావూ... శారదకూ వీణకూ అవినాభావ సంబంధం వుంది... అందుకని... రైట్... ఎగ్రీడ్!... సరేకాని శారదా మనం యీ ఆదివారం అలా సరదాగా తిరిగి రావాలి... మొదట మేట్నీకి, తరువాత పార్కుకి... పిల్లల్ని ప్రక్కింటి అత్తయ్యగారింట్లో వది లేద్దాం ప్లీజ్ శారదా! కాదనకు... తొందరగా తయారవు..."

..."శారదా నను చేరగ......" ...రారాదా మది నిన్నే పిలిచే గాదా..."గాథా సప్తశతి" 'ఆంధ్ర శాతవాహన చక్రవర్తి హాలుని...' హాలికులైననేమి నిజదారసుతోదర పోషణార్థమై ... ... హు! ఇప్పుడు అందరికంటే హాలికుల పనే బావుంది! అన్ని అప్పులూ, సబ్సిడీలు, గ్రాంటులూ వాళ్ళకే! చివరకి యిన్‌కమ్ టాక్సు కూడా లేదు... పోతన్నగారు యిప్పుడుంటే ఎంత సంతో షించేవాడో!..."

"మా తెలుగు తల్లికీ మల్లెపూదండా..." కాదు... "అహో ఆంధ్రభోజా శ్రీకృష్ణదేవరాయా!"...ఇదీకాదు "కనుపించదే నేడు కాకతీయుల మహో"...నవలక్ష ధనుర్ధరాధిపతులట "ఓడల జండాలు ఎగురునందాకా"...రాయప్రోలు..."తెలుగదేల యన్న దేశంబు తెలుగు" ...శ్రీకృష్ణదేవరాయలవారు, కన్నడ రాయడు, కన్న కలలు యిన్నా ళ్ళకు ఆకృతి దాలుస్తున్నాయి... తెలుగువాళ్ళ కెప్పుడూ తెలుగు ఎంత గొప్ప భాషో, తెలుగుదేశం యెంత గొప్పదో, ఎవళ్ళైనా పైదేశస్తులు చెప్పాలి. అప్పుడు వేడి పుడుతుంది. తాటాకు మంటలా మండి చల్లారుతుంది. తెలుగువాళ్ళ యీ తెగులుకు మందిచ్చే నాథుడే లేడే...

"ఒస్తున్నానండీ బాబూ, ఎవరో ఆగండి..." "హో మీరా... మీరాదేవిగారూ... రండి కూర్చోండి. మణీ రామారావ్ లోపల వున్నారు...'నారీ లోకా'నికేమండీ?... మీలాంటి నారీమణులంతా దాన్ని కొంటున్నంత కాలం చక్కగా నడుస్తుంది. ఇంతకీ మీరేపని మీద...అదా...అనుకున్నాలెండి. (కాగితాల దొంతర తెచ్చిందిరా బాబూ యీవిడ!... సీరియల్‌లా వుంది. చదవటం మొదలుపెడితే ఆపదు ...ఏం చెయ్య నేం చెయ్యను...)

"ఓహో! "సీతాపతిగారి సంసారం"లాంటి ధారావాహిక నవలా! శహభాష్! భలేగా రాశారండీ!... ముగింపు అక్కర్లేదు... పాత కథతో సంబంధం అక్కర్లేదు. కరెంట్ టాపిక్స్‌తో, పాత పేర్లతో, వ్రాసేస్తూపోవడం... మీ యిష్టం! ఎన్నాళ్ళైనా నడు స్తుంది!... ఉండం డుండండి... శారదను పిలుస్తాను... ఆమెకు తెలుసుకాని యీ కథల, నవలల బాగోగులు నాకేం తెలుసండీ... వస్తాను కూర్చోండి...

"...అమ్మయ్య! ఏక్షన్సుతోసహా, చదివి వినిపించే మీరాదేవిని తప్పించుకోగలిగా... పాపం శారద ఏం తంటాలు పడుతోందో యేమో!... ఒక్కసారే మాదిరెడ్డి, యద్దనపూడి, సులోచనలంత గొప్ప రైటర్‌ని అయిపోవాలని ఆవిడనవల వెండితెర కెక్కాలని, కోరిక పాపం ఆ మీరాదేవికి."

..."అరే! అరే! ఆవిడని ఆపళానే వొదిలి వచ్చేశావా శారదా?... లేదూ!... మరి...మరి..., అయ్యొ నీ అసాధ్యంకూలా! దాన్ని చదివి నీ అభిప్రాయం చెబుతాననీ,... చంద్రకళామందిర్‌లో క్రొత్త సినిమా గురించిన పరిచయ సభ వుందనీ చెప్పావా... ఆహా!

'బుధి కి బృహస్పతివి'కదా... అది సరే, మరి యింతకీ... "అబ్బబ్బ ఈ కథలలో నాలుగు మంచి కథలుచూసి చెప్పమంటే నా తరమా?... ఏది పచురించబడిందో, ఏది ప్రచురించబడలేదో, నా కసలు గుర్తుండదు కదా! పోనీ అని. యీ రచయితలు పాత కథలు పంపక మానరుకదా! ఇందులో పొరపాటున వో అచ్చయిన కథనే మళ్ళీ అచ్చువేయిసే ఇంటెలిజెంట్ పాఠకులు ఊరుకోవటంలేదుకదా!... కనుక వో నారీలోకపు సంపాదకమణీ, నా శారదా రమణీ... నువ్వే ఆ కథలసంగతి చూసుకో...ఇంకా కావాలంటే వో గంట వంటపని చూసా! నాకేం నామోషి లేదు...వెనుకటికి లింకన్ అన్నట్టు. మన వంట చూసానుకాని వేరేవాళ్ళకి వంట చేసి పెట టం లేదుకదా?... ఈ అంతరా ఊీయ మహిళా సంవత్సరంలోనైనా మనిద్దరం సంసారపు బరువు బాధ్యతల్ని సమానంగా వహిద్దాం..."

"ఛ! ఎంతమాటంది! మీరు వంటసంగతి చూస్తే యింక తిన్నట్టే అనా? హవురా కలికాలం! వంటలో పురుషుల ఆధిక్యత తెలియక అన్నమాట అది...నల, భీమ పాకం అన్నారేకాని ఆడవాళ్ళ పేరెత లేదే! వడ్డన గాజుల హస్తాలతో అయితే బావుంటుంది. కాశీ అన్నపూర్ణ, వడ్డనకే ఫేమస్, కాని వంటకు కాదుకదా!

..."హలో రామనాథం... ఏమిటి యిలా వచ్చేశావు. అరే! అరే! శ్రీమతి కమలారామనాథంకూడా వచ్చేరే!... "ఏమిటీ... ఈ పూట మా యింటో కులాసాగా భోజనంచేసి, సరదాగా మాట్నీకి వెళ్ళి...సాయంత్రం యింటికి వెళ్ళాలనా"... "మై గాడ్! మై గాడ్! నా ప్రోగ్రాం గోవిందా గోవింద!..." అబ్బే ఏంలేదు... గోవిందం వూళ్ళో వున్నాడో లేడో అని అనుకుంటున్నా... అంతే ఊహూ!... మీరు రావడం మాకేం యిబ్బందిగా లేదు!... అబ్బే నువ్వు నిన్న చెప్పకపోయినా ఫరవాలేదు. ఉయ్ ఆర్ వెరీ ప్లీజ్డ్! నిజం... శారదా...శారదా...నీ ఫ్రెండ్ కమలగారూ, నా ఫ్రెండు రామనాథం వొచ్చారు."

# తెలుఁగు పలుకు

## శ్రీ బులుసు వేంకటేశ్వరులు

౧

పంచదారకంటె పటికిబెల్లముకంటె
పండియుండు చూతఫలచయంబు
రసముకంటె చెఱకురసముకంటెను చాల
తీపి గలది కలికి తెలుఁగుపలుకు

౨

వెన్నముద్దకంటె జున్నుకంటె మనోజ్ఞ
మౌ శిరీష మావికాళికంటె
దూదికంటె హంసతూలికకంటెను
లలిత మెన్నఁ గలికి తెలుఁగుపలుకు.

౩

సన్నజాజికంటె సంపంగికంటెను
కుందసుమముకంటె కోమలమగు
మాలతి మరువంబు మందారమునకంటె
అలఘు సురభిళంబు తెలుఁగుపలుకు.

౪

కప్పురంబుకంటెఁ గస్తూరికంటెను
అగరుపొగలకంటె అత్తరువుల
కంటెను ఘుమఘుమలు కలకాలమును (గక్కు)
పొలుపుగలది కలికి తెలుఁగుపలుకు

౫

కలముకంటె వాఁడిఖడ్గంబుకంటెను
శూలచయముకంటె శూరవర్య
శస్త్రవితతికంటె శస్త్రాస్త్రములకంటె
దివ్యబలముకలది తెలుఁగుపలుకు.

౬

అందమై నితాంత మానందకందమై
ముత్తియముల భంగి ముద్దుగులుకు
రత్నచయముపగిది రమ్యాతిరమ్యమై
వెలయుచుండుఁ గలికి తెలుఁగుపలుకు.